# ఆర్డినెన్సు నెంబర్ 25ను ఉపసంహరించాలి

*పబ్లిక్‌రంగ సంస్థ కార్మికులను ప్రభుత్వ శాఖల్లోకి బదిలీ చేయడాన్ని నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ **26**న ఆర్డినెన్స్ నెంబర్ **25**ను జారీ చేసింది. ఆర్డినెన్సులో దిగువ పేర్కొన్న అంశాలున్నాయి.*

1. పబ్లిక్ రంగ సంస్థలోని ఏ ఉద్యోగినైనా అతడు/ ఆమె పనిచేసే సంస్థ ఖాయిలా పడిందనో, ఖాయిలా పడనున్నదనో లేక మూత పడిందనో, మూత పడనున్నదనో కారణంమీద ప్రభుత్వ సర్వీసులోకి బదిలీ చేయడాన్ని ఆర్డినెన్సు నిషేధిస్తుంది. అలా బదిలీ చేయడానికి అవకాశం కల్పిస్తున్న ఒప్పందాలు, న్యాయస్థానాలు, ట్రిబ్యునల్స్ లేక ఇతర సంస్థలు ఇచ్చిన తీర్పులు, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అన్నీ రద్దయినట్లు భావించాలి.
2. పబ్లిక్ రంగ సంస్థల కార్మికులను ప్రభుత్వ శాఖల్లో నియమిస్తూ ఇప్పటికే జారీ అయిన ఉత్తర్వులు నవంబర్ 30, 1996తో రద్దవుతాయి.
3. తమను ప్రభుత్వ శాఖల్లో విలీనం చేయాలని కోరుతూ ఏ పబ్లిక్ రంగ సంస్థ కార్మికుడైనా ప్రభుత్వంపై కోర్టులో దావా వేయడానికి యికనుంచి వీల్లేదు.
4. ప్రభుత్వ సర్వీసులోకి పబ్లిక్ రంగ సంస్థ కార్మికులను తీసుకోవాలని వచ్చిన ఏ ఉత్తర్వులనైనా, డిక్రీలనైనా అమలుపర్చమనే అధికారం ఈ ఆర్డినెన్సు ప్రకారం కోర్టులకు కూడా లేదు.

**సుబ్రహ్మణ్యం కమిటీ నిపుణులను, కార్మికులను, ప్రజా ప్రతినిధులను సంప్రదించలేదు. ఆయా సంస్థల అధిపతులతో మాత్రమే సంప్రదింపులు జరిపింది. ఈ కమిటీ పబ్లిక్ రంగ సంస్థలు ఖాయిలా పడటానికి గల అసలు కారణాలను వెదకలేదు. వాటిని సమర్థవంతంగా నడపటానికి సలహాలను, సూచనలను వేటినీ ఆహ్వానించలేదు.**

ఈ ఆర్డినెన్సు భవిష్యత్తులో పబ్లిక్ రంగ సంస్థ ఉద్యోగులను ప్రభుత్వ సర్వీస్‌లోకి తీసుకోవడాన్ని మాత్రమే నిషేధించడం లేదు. ఇప్పటికే పబ్లిక్ రంగ సంస్థల నుండి ప్రభుత్వ శాఖల్లోకి బదిలీ అయినవారిని కూడా బర్తరఫ్ చేస్తుంది. బర్తరఫ్‌ను సవాలు చేస్తూ కోర్టుకు వెళ్లే అవకాశాన్ని కూడా తొలగిస్తుంది.

ఆల్విన్ కార్మికుల పట్ల కక్షతో ప్రభుత్వం ఈ ఆర్డినెన్సును జారీ చేసింది. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆల్విన్ రిఫ్రిజిరేటర్, ఆల్విన్ అప్లయన్సెస్ కంపెనీలను వోల్టాస్ కంపెనీకి అమ్మింది. వోల్టాస్ ఆల్విన్ కంపెనీని కొనుగోలు చేసినప్పుడు అనేక షరతులను విధించింది. అందులో భాగంగా ఆల్విన్‌లో అవసరానికంటే ఎక్కువమంది కార్మికులున్నారని, వారిని తొలగించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఈ డిమాండును అంగీకరించింది. తొలగింపబడిన కార్మికులను ప్రభుత్వ సర్వీసులోకి తీసుకుంటానని హామీ ఇచ్చింది. ఆ మేరకు 1994లోనే ప్రభుత్వం 1486 మంది కార్మికులకు కన్సాలిడేటెడ్ జీతాలతో తాత్కాలిక ఉద్యోగాలు ఇచ్చింది. ఈ రకంగా ప్రభుత్వ సర్వీసులో చేరిన కార్మికులను వారి అర్హతలను బట్టి, సీనియారిటీని బట్టి వేతనాలు నిర్ణయించి వెంటనే రెగ్యులరైజ్ చేస్తానని నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వాగ్దానం చేసారు. కాని ఈ నిర్ణయాలను నాటి కాంగ్రెసు ప్రభుత్వంగానీ, తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం గానీ అమలు చేయలేదు. ఒకవేపు రీ డిప్లాయ్ చేయబడిన ఆల్విన్ కార్మికులు తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని ఆందోళన సాగిస్తుండగా మరోవైపు ప్రభుత్వం జీవో నెం. 192 ద్వారా వారిని ఉద్యోగాల నుండి తొలగించింది. కార్మికులు కోర్టుకు వెళ్లి జీవో అమలును ఆపగలిగారు.

కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకునే బదులు, తన చర్యలను సవరించుకొని కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయడానికి బదులు ప్రభుత్వం ఆర్డినెన్సు నెంబర్ 25ను జారీ చేసింది. దీనికి వ్యక్తమైన నిరసన తర్వాత ప్రభుత్వం రీ డిప్లాయ్ చేయబడిన ఆల్విన్ కార్మికుల బర్తరఫ్‌ను నిలిపివేసింది కానీ ఆర్డినెన్సును మాత్రం ఉపసంహరించుకోనని ప్రకటించింది ఈ ఆర్డినెన్సు ఆల్విన్ కార్మికులకే కాక అన్ని పబ్లిక్‌రంగ సంస్థలకూ వర్తిస్తుంది.

రాష్ట్రంలో 39 పబ్లిక్‌రంగ సంస్థలు, 29 కోఆపరేటివ్ సంస్థలున్నాయి. ఏటిలో 21 పబ్లిక్ రంగ సంస్థలు, అన్ని కోఆపరేటివ్ సంస్థలు నష్టాల్లో వున్నాయి. ఈ కంపెనీలన్నింటిలో కలిపి దాదాపు మూడున్నర లక్షల కార్మికులున్నారు. ఈ ఖాయిలా పడిన పరిశ్రమల భారాన్ని మోయలేనంటూ రాష్ట్రప్రభుత్వం గత రెండేళ్లుగా ప్రకటనలిస్తూనే వుంది. ఈ సమస్య నుండి బయటపడటానికి, కొన్ని పబ్లిక్ రంగ సంస్థలను వదిలించుకోవటానికి ఏదైనా మార్గం సూచించమని ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. దాన్నే సుబ్రహ్మణ్యం కమిటీ అంటారు. 1995లో ఈ కమిటీ తన నివేదికను సమర్పించింది కాని ఈ కమిటీ నిపుణులను, కార్మికులను, ప్రజా ప్రతినిధులను సంప్రదించలేదు. ఆయా సంస్థల అధిపతులతో మాత్రమే సంప్రదింపులు జరిపింది. ఈ కమిటీ పబ్లిక్ రంగ సంస్థలు ఖాయిలా పడటానికి గల అసలు కారణాలను వెదకలేదు. వాటిని సమర్థవంతంగా నడపటానికి సలహాలను, సూచనలను వేటినీ ఆహ్వానించలేదు.

సుబ్రహ్మణ్యం కమిటీ అన్ని రంగాల్లోనూ పబ్లిక్‌రంగ సంస్థలు పనికిరావని అభిప్రాయ పడింది. కొన్ని రంగాల్లో పబ్లిక్ రంగ సంస్థలను మూసేసి ప్రైవేట్ రంగానికి అవకాశాలివ్వాలని భావించింది. మిగతా కంపెనీల్లో కార్మికుల సంఖ్యను తగ్గించి, పునర్వ్యవస్థీకరించాలని

సూచించింది. సుబ్రహ్మణ్యం కమిటీ నివేదికలోని కొన్ని భాగాలను పరిశీలిద్దాం.

''తొలుత పబ్లిక్ రంగ సంస్థలకే కేటాయించిన విధుల్లో కొన్నింటిని - ప్రత్యేకించి ఉత్పత్తి, మార్కెటింగ్ వంటివి - ప్రజా సంక్షేమానికి నష్టం జరగకుండా ఇప్పుడు అందుబాటులో వున్న పెట్టుబడి వలన ప్రైవేట్ రంగం నెరవేర్చగలదు. పబ్లిక్ రంగ సంస్థలు కొన్ని రంగాల్లో మొదట ప్రవేశించి ఇన్నాళ్లు తమ కార్యకలాపాలను కొనసాగించడం వల్లనే ప్రైవేట్ రంగానికి ప్రవేశించటానికి అవకాశాలు లభించాయి''.

కమిటీ కేవలం లాభనష్టాల ఆధారంగానే పబ్లిక్ రంగ సంస్థలను కొనసాగించాలా వద్దా అన్న నిర్ణయం తీసుకోలేదు. లాభమనేది సమర్థతకు సూచిక అయినప్పటికీ కొన్ని రంగాల్లో అవసరార్థం నష్టం వచ్చినా పబ్లిక్ రంగ సంస్థలను కొనసాగించవలసి వస్తుందని కమిటీ పేర్కొంది. మరికొన్ని సందర్భాలలో లాభాలు వచ్చే అవకాశం వున్నా పబ్లిక్ సంస్థలు కొనసాగడం అనవసరం కావచ్చునని కమిటీ అభిప్రాయ పడింది. అంటే లాభసాటిగా ప్రైవేట్ రంగం నిర్వహించగల రంగాల్లో పబ్లిక్‌రంగ సంస్థలు అనవసరమన్నమాట. ఏ రంగాలనైతే ప్రైవేట్ రంగం నిర్వహించటానికి సిద్ధంగా లేదో అక్కడ మాత్రమే పబ్లిక్ రంగం కొనసాగుతుంది.

పెట్టుబడిదారుల ప్రయోజనాల కనుగుణంగా పబ్లిక్ రంగ సంస్థల పట్ల ప్రభుత్వ విధానం నిర్ణయమవుతుందనేది దీన్నిబట్టి స్పష్టం. మరి ఆ సంస్థల్లో పనిచేసే కార్మికుల మాటేమిటి? మూతబడే సంస్థల్లోని కార్మికులకు కార్మిక వివాదాల చట్టం ప్రకారమే టర్మినల్ బెనిఫిట్స్ ఇవ్వాలని కమిటీ సూచించింది. పునర్వ్యవస్థీకరించే సంస్థల్లోని మిగులు కార్మికులను భారత ప్రభుత్వం ఇస్తున్న వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ అమలుచేసి తొలగించాలని కమిటీ పేర్కొన్నది. ఇది తప్ప ఇతర వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీము ఏదైనా అమలులో వున్నా దానిని నిలిపివేయాలని కమిటీ చెప్పింది. కమిటీ పబ్లిక్‌రంగ సంస్థల ఆస్తులను అమ్మడం వలన వచ్చిన మొత్తంనుండే ఈ స్కీములకు డబ్బులు ఇవ్వాలని పేర్కొంది. ఆస్తుల అమ్మకం ద్వారా డబ్బులు రావడం ఆలస్యమైతే ప్రభుత్వం తన ఖజానా నుండి మొదట చెల్లించి తర్వాత వచ్చిన డబ్బులను జమచేసుకోవాలని అభిప్రాయపడింది.

ఈరకంగా కమిటీ కార్మికుల విషయంలో మాత్రమే లాభనష్టాలను బేరీజు వేసుకుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ కార్మికుల భారం ప్రభుత్వం




మీద పడకుండా జాగ్రత్త పడింది.

పబ్లిక్ రంగ సంస్థల కార్మికుల ఆందోళన వలన ఈ నివేదిక అమలు ఆగిపోయింది. కానీ 1996 జూన్ నెలలో రాష్ట్రప్రభుత్వం ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం ప్రకటించడంతో పబ్లిక్‌రంగ సంస్థలపై చర్చ మళ్లీ మొదలైంది. శ్వేతపత్రంలో పబ్లిక్‌రంగ సంస్థల గురించి ప్రభుత్వం ఇలా వ్యాఖ్యానించింది.

''పబ్లిక్ రంగ సంస్థలను నిర్దిష్టమైన కార్యకలాపాల నిర్వహణకు, ఖచ్చితంగా నిర్వచించబడిన లక్ష్యాలను సాధించడానికిగాను ఏర్పరచాము. కాలక్రమంలో ఆర్థిక పరిస్థితుల్లో వస్తున్న మార్పుల వలన కొన్ని లక్ష్యాలు నిరర్థకమయ్యాయి. కొన్ని సందర్భాల్లో పబ్లిక్‌రంగ సంస్థల ద్వారా సేవలనందించడం అవసరమూ, వాంఛనీయమూ కాదు. పొదుపు కూడా కాదు. పబ్లిక్ రంగ సంస్థల ద్వారా అందిస్తున్న సేవలు ప్రభుత్వం పెట్టిన పెట్టుబడికి, ఇచ్చిన రుణాలకు సమానంగా ఉన్నాయా అనేది ప్రశ్నార్థకమే.

చాలా పబ్లిక్ రంగ సంస్థలు జీతాలకూ, నిర్వహణకూ కావలసిన మొత్తాన్ని కూడా సమకూర్చుకోలేక పోతున్నాయి. ప్రభుత్వమే ఆర్థిక సమస్యలతో సతమతమవుతుండగా పబ్లిక్‌రంగ సంస్థలకు సహాయం అందించడం సమర్థనీయమా?''

ఏ ప్రకటన చూసినా రాష్ట్రప్రభుత్వం ఏదో ఒక కారణం చూపించి చాలా పబ్లిక్ రంగ సంస్థలను మూసివేసేటట్టున్నదని స్పష్టంగానే తెలుస్తున్నది. ప్రభుత్వానికి పబ్లిక్ రంగ సంస్థలను మూసేసి, ఉత్పత్తి వినిమయ రంగాలను పూర్తిగా ప్రైవేట్‌పరం చేయాలన్న తాపత్రయమే వున్నది కానీ కార్మికుల సంక్షేమం గురించి ఏమాత్రం పట్టింపు లేదు. కార్మికుల సంక్షేమం కోసం సమగ్రమైన పథకాన్ని రూపొందించే బదులు ఎలాగైనా తన బాధ్యతలనుండి తప్పుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది.

ఆర్డినెన్సు ముందుమాట ప్రభుత్వ ఆలోచనలను బాగా వ్యక్తీకరిస్తున్నది. ''రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని పబ్లిక్ రంగ సంస్థలు ఖాయిలాపడినందున లేక ఖాయిలా పడనున్నందున మరియు మూసివేయబడినందున లేక మూసివేయబడనున్నందున అట్టి సంస్థల్లోని ఉద్యోగులు పబ్లిక్ సర్వీసులో విలీనం చేయవలసిందని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నందున;

అట్టి పబ్లిక్ రంగ సంస్థల ఉద్యోగులను ప్రభుత్వ సర్వీసులో విలీనము చేసుకొనుట వలన ప్రభుత్వ ఖజానాపై పెనుభారము పడి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు తీవ్రంగా కుంటుపడి ప్రజాహితానికి భంగము కలుగనున్నందున;

పబ్లిక్ రంగ సంస్థల ఉద్యోగులను ప్రభుత్వ సర్వీసులోకి తీసుకోవడాన్ని నిషేధించాము''.

ఇప్పటికే తీసుకున్న 1486 మంది కార్మికుల విషయంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకున్నది కానీ ఖాయిలాపడిన పబ్లిక్‌రంగ సంస్థల కార్మికుల సంక్షేమానికై ప్రభుత్వం యింతవరకు సమగ్రమైన విధాన నిర్ణయం మాత్రం ప్రకటించలేదు. అంటే కార్మికుల సంక్షేమం కొరకు ఏ బాధ్యతనూ స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని ఈ ఆర్డినెన్సు తెలియ చేస్తున్నది. మూతబడిన ఎ.పి. స్కూటర్స్ కార్మికుల సంక్షేమానికై ప్రభుత్వం ఏ చర్యా చేపట్టలేదని అందరికీ తెలుసు. కనుక ఆర్డినెన్సు ఉపసంహరణకు ఉద్యమించడం ద్వారానే కార్మికులు తమ హక్కులను రక్షించుకోగలుగుతారనేది స్పష్టమే.